క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం


కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఉద్యోగులు

చాగలమర్రి: ప్రకృతి వ్యవసాయంతో పంటలను సాగు చేస్తే సమాజానికి ఆరోగ్యకరమైన పంట దిగుబడులతో పాటు భూమి సారవంతమవుతుందని మండలంలోని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్‌లు కదిరి బాషా, నాగేశ్వరరెడ్డి, నిరంజన్ అన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన కూరగాయలు, ఆకు కూరల విక్రయ స్టాల్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు 20 మంది పాల్గొన్నారు.

23న ఎరుకలస్వామి ఆరాధన


ఆది అల్లూరి ఎరుకలస్వామి

దొర్నిపాడు: మండల కేంద్రంలోని కోట ఆవరణలో ఉన్న అవధూత శ్రీ ఆది అల్లూరి ఎరుకలి స్వామి ఆరాధన మహోత్సవాన్ని ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు బాలిరెడ్డి, సిద్ది సత్యనారాయణ, అక్కల శివయ్య సోమవారం తెలిపారు. ఉదయం గోపూజ, ప్రాతఃకాల పూజ, అభిషేకం అనంతరం భగవద్గీత పారాయణం, మహా మంగళహారతి, భజన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే సాయంత్రం ప్రియవర్ధిని కూచిపూడి నాట్యం, రాత్రి భక్తజన చింతామణి పూర్తి నాటకం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి కృపకు పాత్రులు కావాలని కోరారు.

దుండగులను శిక్షించాలి

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని శాంతిరాం కాలేజీ వద్ద భార్యభర్తలపై దాడి చేసి దోపిడీ చేసిన దొంగలను వెంటనే పట్టుకొని శిక్షించాలని ఎస్‌డీపీఐ నాయకులు కరీముల్లా, అనీఫ్ కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి శాంతిరాం మెడికల్ కాలేజీ సమీపంలో భార్యభర్తలను అడ్డగించి వారిని తీవ్రంగా కొట్టి వారి వద్ద నుండి బంగారాన్ని దొంగిలించిన దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యాధికారి నరసింహ, వైద్య సిబ్బంది

ఆళ్లగడ్డ : కుష్టు వ్యాధి నిర్మూలనకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని ఆళ్లగడ్డ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి నరసింహ అన్నారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు చేపట్టనున్న వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేకు సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కుష్టు వ్యాధి లక్షణాలపై విరివిగా అవగాహన కల్పించాలన్నారు. రచ్చబండలు, పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దస్తగిరిరెడ్డి, శాంతి, శ్రీనివాసులు ఉన్నారు.

రుణాల అర్హుల జాబితా కోసం నిరీక్షణ

నంద్యాల(అర్బన్): బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న అర్జీదారులను ఏపీఓబీఎంఎంఎస్ (ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) ద్వారా వచ్చే అర్హుల జాబితా కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ వర్గాలకు వ్యవసాయం, రవాణా, పరిశ్రమ, ఎల్రక్టానిక్ సర్వీసులు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించింది. అందులో భాగంగా 2,156 మంది బీసీలకు రూ.45.84 కోట్లు, ఈబీసీ వర్గాల 73 యూనిట్లకు రూ.1.27 కోట్లు, కమ్మ కార్పొరేషన్ కింద 15 యూనిట్లకు రూ.26 లక్షలు, రెడ్డి కార్పొరేషన్ కింద 45 యూనిట్లకు 78లక్షలు, ఆర్య వైశ్య కార్పొరేషన్ ద్వారా 26 యూనిట్లకు రూ.45లక్షలు, బ్రాహ్మణ కార్పొరేషన్ కింద 10 యూనిట్లకు రూ.17లక్షల మేర స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరణకు ఈనెల 16వ తేదీ చివరి తేదీగా ప్రకటించారు. అర్హుల జాబితా ఇంత వరకు తేలకపోవడంతో అర్జీదారులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ విషయంపై ఉమ్మడి కర్నూలు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్‌హుసేన్‌ను వివరణ కోగా ఆన్‌లైన్ ఓపెన్ కావడం లేదని, రెండుమూడు రోజుల్లో సమాచారం అందజేస్తామని తెలిపారు.

● రాజకీయ వేధింపులు ఆపాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఓఏలు, సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): వీఓఏలపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని బేతంచెర్ల వీఓఏ లక్ష్మీదేవి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వీఓఏల సంఘం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య మాట్లాడుతూ వీఓఏలను తొలగించాలన్నా, ఉంచాలన్నా గ్రామ సంఘం తీర్మానం చేయాలన్నారు. శంకరయ్య, వెంకటరమణ, భాస్కర్, రామమద్దిలేటి, మధు, నాగేంద్ర, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● సమస్యల పరిష్కారానికి 'సహక'రించండి

నంద్యాల(న్యూటౌన్): సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరభద్రుడు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ ఉద్యోగులకు 62 సంవత్సరాలు పదవీ విరమణ వయస్సుకు పెంచాలని, గ్రాట్యువిటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలనికోరారు. సుబ్బారావు, అక్తర్, దస్తగిరి, ఆదినారాయణ, కిరణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సహకార సంఘం ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

ప్రజా సమస్యల వేదికకు అధికారుల డుమ్మా


ప్రజా వేదికలో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కొన్ని శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కలెక్టర్ రాజకుమారి ప్రజల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి మండల స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నా.. కొందరు అధికారులు మాత్రం తమకు అవేవీ వర్తించవంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి కేవలం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, మరో మూడు శాఖల నుంచి కింది స్థాయి అధికారులు పాల్గొన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మైనర్ ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర 20 శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు.

జొన్నరైతు కుదేలు

- ఈ ఏడాది అనుకూలించని వాతావరణం
- భారీగా తగ్గిన దిగుబడి, ధర
- నష్టాల బాటలో రైతులు
- మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వం


ఎర్రగుడిదిన్నె వద్ద జొన్న కోస్తున్న యంత్రం

రుద్రవరం: జొన్నల ధర భారీగా పడిపోయింది. ఈ ఏడాది ప్రకృతి అనుకూలించకపోవడంతో దిగుబడి సగానికిపైగా తగ్గిపోయింది. దీనికితోడు ధరకూడా అమాతం పడిపోవడంతో జొన్నరైతు నష్టాల్లో మునిగి విలవిల్లాడుతున్నాడు. అయినా ప్రభుత్వం ఆదుకోవడంలోదని, మద్దతు ధర ప్రకటించడం లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

4వేల ఎకారాల్లో సాగు..

మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు ఎర్రగుడిదిన్నె, పేరూరు, చిలులూరు, చందలూరు, మందలూరు, నక్కలదిన్నె, ముత్తలూరు, నల్లావాగుపల్లె, నర్సాపురం, తిప్పారెడ్డిపల్లె తదితర గ్రామాల పరిధిలోని రైతులు ఈ ఏడాది దాదాపు 4వేల ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. ఒక్కో ఎకరానికి దాదాపు వేలాది రూపాయలు ఖర్చు చేశారు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అయితే అల్ప పీడనాలు, అధిక వర్షాలు, తెగుళ్ల, ఈదురు గాలులకు పంట నేలవాడంతో పంటలు బాగా దెబ్బతిన్నాయి.

పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి

పంట కాలం పూర్తి కావడంతో ఇటీవల కోతలు మొదలయ్యాయి. వచ్చిన ధాన్యాన్ని రైతులు రోడ్లు, బయలు ప్రదేశాల్లో ఆరబోశారు. గతేడాది జొన్నలు ఎకరానికి 20 క్వింటాళ్ల దిగుబడి రాగా ఈ ఏడాది కేవలం 6 నుంచి 10 క్వింటాళ్లకు మించి రావండ లేదు. ధర గతేడాది క్వింటా రూ.3,400 పలుకగా ఈ ఏడాది కేవలం రూ.2వేలకే పడిపోయింది. అయితే ధాన్యం కూడా నాసిరకంగా ఉందని కొనుదారులు కూడా వాటిని కొనేందుకు అటువైపు కూడా రావడంలేదు. ఒక్కో ఎకరానికి సేద్యాలు, భూమి మందులు, పిచికారీకి పురుగు మందులు, నీళ్ల పారించుకునే ఖర్చు, కూలీల ఖర్చు, చివర్లో యంత్రాలతో కోతలు కోయించే ఖర్చు అన్నింటిని కలిపితే దాదాపు రూ.30వేల వరకు ఖర్చు అవుతోంది. వచ్చిన దిగుబడి చూస్తే ఎకరానికి సగటున 8 క్వింటాళ్లు వచ్చినా వాటిని విక్రయిస్తే రూ.16వేలే వస్తోంది. అంటే పెట్టుబడిలో సగం మాత్రమే రైతుకు చేతికందుతోంది. దీంతో చేసిన శ్రమ వృథా అవ్వడంతో పాటు ఒక్కోకరానికి దాదాపు రూ.15వేలు నష్టపోవాల్సి వస్తోందని ఆయా గ్రామాల రైతులు లబోదిబోమంటున్నారు.


ఎర్రగుడిదిన్నె–పేరూరు దారిలో ఆరబోసిన జొన్నలు

భారీగా నష్టపోయాం



మావి ఒట్టి పొలాలు కాబట్టి ఒక్క పంటే వేస్తాం. ఈ ఏడాది పదెకరాల్లో జొన్న సాగు చేశా. అయితే వాతావరణం అనుకూలించలేదు. ఎప్పుడు ఏదోఎక విపత్తు, వాటికి తోడు ఊస తెగులు సోకడంతో పంట దిగుబడి తగ్గింది. ఎకరానికి ఆరు బస్తాలు కూడా రాలేదు. గత ప్రభుత్వ హయాంలో ముందస్తుగానే ధాన్యానికి తగ్గట్టుగా మద్దతు ధర ప్రకటించారు. అప్పుడు ధర బాగుండేది, దిగుబడి ఒకరానికి 20 బస్తాలు రావడంతో మంచి లాభాలు గడించాం. ఈ ఏడాది అంతకు అంతా నష్ట పోయాం.

– లింగారెడ్డి, రైతు, ఎర్రగుడిదిన్నె

ఆదుకోని కూటమి ప్రభుత్వం



10 ఎకరాల్లో జొన్న సాగు చేశాను. పంట బాగా దెబ్బతిని నేలవాలింది. దిగుబడి అరకోరగా వచ్చేలా ఉంది. భారీగా నష్టా పోవాల్సి వస్తోంది. రైతులు విలావిల్లాడుతుంటే కూటమి ప్రభుత్వం ఏమి పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం నుంచి సహాయం, సహకారం లేదు. అదే గత ప్రభుత్వ హయాంలో సీజన్ల వారీగా రైతు భరోసా ద్వారా సాయమందించారు. అలాగే విపత్తుల వల్ల పంటలు దెబ్బతింటే ఏ సీజన్‌కు ఆ సీజన్ బీమా సాయం అందింది. ఇప్పుడు అలాంటివి ఏవీ లేవు. – తిరుపతిరెడ్డి, రైతు, పేరూరు

బాలోత్సవాలను విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగే నంది బాలోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రామరాజు, ఆహ్వాన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి మౌలాలి, ఉపాధ్యక్షుడు ఎంఆర్‌నాయక్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసం సమాజం పట్ల పిల్లల్లో అవగాహన పెంచడం కోసం ఏటా బాలోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 16 అకాడమీ, 9 సంస్కృతి విభాగాల్లో 45 రకాల పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మంత్రి ఫరూక్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, చైర్మన్ మాబున్నిసా, డీఈఓ జనార్ధన్‌రెడ్డి, కమిషనర్ నిరంజన్‌రెడ్డి పాల్గొననున్నారని చెప్పారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నంద్యాల పట్టణ అధ్యక్షుడిగా రవికుమార్, కార్యదర్శిగా విష్ణు, ఉపాధ్యక్షుడిగా బాబు, సహాయ కార్యదర్శులుగా శివను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర మహాసభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో నేటి నుంచి నిర్వహించే ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అమానుల్లా తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో దీబగుంట్ల, నెహ్రూనగర్, ఎస్. నాగులవరం, కానాలపల్లె సచివాలయాల పరిధిలోని వారికి దీబగుంట్లలో, 23, 24న యాళ్లూరు,ఎం.క్రిష్టాపురం గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి యాళ్లూరులో, 27న సాంబవరంలో, 28న రాయపాడు, తేళ్లపురి, పసురపాడు, గోస్పాడు, ఒంటివెలగల గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి రాయపాడులో, 29న జిల్లెలల్లో, 30న జూలేపల్లె, ఎం.చింతకుంట్ల గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి జూలేపల్లెలో శిబిరాలు ఏర్పాటు చేస్తారని వివరించారు.

నిబంధనల ప్రకారం జీతాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే సెక్యూరిటీ, శానిటేషన్ వర్కర్లకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీతాలు అమలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ, జిల్లా ప్రధా న కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమ వారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. జీవో 549 ప్రకారం రూ.16వేలకు గాను ఒప్పంద నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అతి తక్కువ వేతనం చెల్లిస్తున్నారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. తులశమ్మ, సుభద్ర, లక్ష్మి, సింహాద్రి, రవి, రాజేష్, రాముడు, విజయ్ పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించండి


ఆవేదన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

నంద్యాల(అర్బన్): 38 ఏళ్ల క్రితం విక్రయదస్తావేజు ద్వారా రిజిస్టర్లు చేయించుకొని నివాసం ఉంటున్న తమ ఇళ్ల స్థలాలను ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న వారి నుంచి రక్షణ కల్పించాలని పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న బర్మాశాలకు చెందిన బాధితులు ప్రభాకర్‌రావు, అన్నమ్మ, రమణయ్య, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య తదితరులు వాపోయారు. సోమవారం వారు మాట్లాడుతూ..సర్వే నంబరు 614 పైకి 44 సెంట్ల స్థలంలో నాలుగు దశాబ్దాల క్రితం ఇంటి నిర్మాణాలు చేపట్టి కుళాయి పన్ను, ఇంటి పన్నులు చెల్లిస్తున్నామన్నారు. స్థలం మాదంటూ స్థానికులు శివరామిరెడ్డి వేసిన పిటీషన్‌ను కోర్టు కొట్టి వేసిందన్నారు. అయినప్పటికీ శివరామిరెడ్డి కుమారులు ఇటీవల పట్టణానికి చెందిన అలీ పేరు మీద నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. దీన్ని సాకుగా చూపుతూ స్థలాలు ఖాళీ చేయాలంటూ ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న తమపై దాడులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ కల్పించాలంటూ ఇటీవల ఎస్పీ, పీజీఆర్ఎస్ కార్యక్రమాల్లో వినతి పత్రాలు అందజేసినా ప్రయోజనం లేకుండా పోయిందని కన్నీరు పెట్టుకున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణ దారుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే


ఎస్.కొత్తపల్లెలో రైతులతో కలిసి సర్వేలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు


గోస్పాడులో సర్వేను ప్రారంభిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : శాశ్వత భూ హక్కు భూరక్ష పథకంలో భాగంగా మండలంలో ఎస్.కొత్తపల్లె గ్రామంలో భూముల రీ సర్వే పకడ్బందీగా నిర్వహించనున్నట్లు డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వం ఎంపిక చేసిన పైలట్ ప్రాజెక్ట్‌పై గ్రామంలో రీ సర్వే పనులు రైతులతో కలిసి రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. ఈ గ్రామంలో 251 మంది రైతులకు చెందిన 973.40 ఎకరాల విస్తీర్ణంలో రికార్డుల స్వచ్ఛీకరణ, వర్క్ షాప్‌లో సందేహాలను రైతులకు నివృత్తి చేస్తూ సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓలతో చర్చించడం జరిగిందన్నారు. రోజుకు ముందస్తుగా గ్రామంలో 5 మంది రైతులకు నోటీసులు అందజేసి 20 ఎకరాల చొప్పున రీ సర్వే చేయడం జరుగుతుందన్నారు.

రీ సర్వే పునప్రారంభం

శిరివెళ్ల: మండలంలో ఏడాడి తర్వాత భూముల రీ–సర్వే పునఃప్రారంభమయ్యింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 5 గ్రామాలలో సర్వే జరిగింది. మిగిలిన గ్రామాలలో కూటమి ప్రభుత్వం సర్వేను చేపట్టింది. మండలంలో జీనేపల్లెలో సోమవారం సర్పంచు రాజారెడ్డి సర్వేను ప్రారంభించారు. తహసీల్దార్ పుష్పకుమారి మాట్లాడుతూ గ్రామంలో 678 మంది రైతులకు సంబంధించిన 1667 ఎకరాలను సర్వే చేయడం జరుగుతుందన్నారు.

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామంలో సోమవారం భూ రీసర్వే పనులను డిప్యూటీ తహసీల్దార్ మాధవ, మండల సర్వేయర్ నాగప్రసాద్ ప్రారంభించారు. గ్రామంలో మొత్తం 870 ఎకరాల భూమి ఉందని, మూడు టీంలను ఏర్పాటు చేసి రోజు 25 నుంచి 30 ఎకరాల వరకు భూ రీసర్వే చేస్తారన్నారు.

గోస్పాడు: రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్ అన్నారు. మండలంలోని ఎస్.కూలూరు గ్రామాన్ని రీ సర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారని తెలిపారు. అందులో భాగంగా సర్వే పనులు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో 208 మంది రైతులకు చెందిన 619 ఎకరాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ హుసేని, మండల సర్వేయర్ ఉమామహేశ్వరరావు, వీఆర్‌ఓలు పెద్దయ్య, భాస్కరరెడ్డి, రైతులు పాల్గొన్నారు. ముత్యాలపాడులో ఇంటింటి సర్వే

ముత్యాలపాడులో ఇంటింటి సర్వే

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని ముత్యాలపాడు గ్రామంలో సోమవారం రెండో విడత కుష్టు వ్యాధి నివారణ సర్వేను ప్రారంభించారు. ఈ సర్వేలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించి, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సర్వే ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగుతుందని పీహెచ్‌సీ ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు తెలిపారు. ఏఎన్ఎం పి.సుభాషిని, సి.లక్ష్మీదేవి, ఆశ కార్యకర్తలు లక్ష్మీనరసమ్మ, రమాదేవి, పీరమ్మలు పాల్గొన్నారు.


సర్వే నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఎంఎస్ఎంఈ యూనిట్ల సర్వే పూర్తి చేయండి

- వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి


వయోజన విద్య పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల: జిల్లాలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల సంబంధించి పెండింగ్‌లో ఉన్న సర్వేను ఈ నెల 31వ తేదీలోగా సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లతో పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓలను ఆదేశించారు. జిల్లాలో ఇంకా 65 వేల యూనిట్ల సర్వే పెండింగ్ ఉందని, సచివాలయ సర్వే వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా కమర్షియల్ విద్యుత్ యూనిట్లకు సంబంధించిన డేటాను పంపామని గ్రామ/వార్డు సచివాలయాల వారీగా విభజించి సర్వేలను పూర్తి చేయాలని ఎంపీడీఓ, తహసీల్దార్లకు సూచించారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

15 – 50 సంవత్సరాలలోపు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని స్వయం సహాయక బృందాల సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం కింద నిర్వహిస్తున్న వయోజన విద్యా కేంద్రాలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ప్రతి 10 మంది నిరక్షరాస్యులైన వయోజలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఒక వలంటరీ టీచర్ ఉంటారని, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిర్వహించే ఈ కేంద్రాలను జిల్లా అధికారులు సందర్శించి ప్రోత్సహించాలని చెప్పారు. మార్చి 31వ తేదీలోగా 26వేల మంది నిరక్షరాస్యులకు తెలుగులో సంతకం పెట్టడమే కాకుండా అక్షరాలను గుర్తుపట్టేలా నేర్పించాలని తెలిపారు. మార్చి 31 తర్వాత నిర్వహించే ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా శిక్షణనివ్వాలని సూచించారు.

అసంఘటిత కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ఈ–శ్రామ్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అసంఘటిత కార్మికులందరూ నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భవన కార్మికులు, వలస కార్మికులు, ఇళ్లలో పనిచేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, మత్స్య కార్మికులు, ఉపాధి వేతనదారులు, లఘు వ్యాపారులు తదితర కార్మికులందరూ ఈ– శ్రామ్ పోర్టల్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రమాదవశాత్తు ఏదైనా సంఘటన జరిగితే ఒక్కో వ్యక్తికి రూ.2 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎనిమిది మంది కార్మికులకు రూ.16 లక్షలను చెల్లించామని చెప్పారు. ఇంకా 5,20,274 మంది రిజిస్టర్ చేసుకోవాల్సి ఉందని, ప్రత్యేక దృష్టి సారించి నమోదు చేయించాలన్నారు.

అన్నదానం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో గుడిపాటి గడ్డ రైతులు, శివస్వాముల అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో శివమాలధారులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని బీజేపీ నంద్యాల జిల్లా పార్లమెంటరీ కో ఆర్డినేటర్ అభిరుచి మధు ప్రారంభించారు. ముందుగా స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రైతు నాయకులు గుడిపాటి ప్రసాద్, మిద్దె సుబ్బయ్య మాట్లాడుతూ నేటి నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు శివదీక్షా పరులకు మధ్యాహ్నం 11రకాల వంటకాలతో ప్రసాదం వడ్డిస్తామని చెప్పారు. అలాగే..వసతి లేని వారికి ఆలయ ఆవరణలో వసతి కూడా ఏర్పాటు చేశామన్నారు.వైఎస్సార్‌సీపీ నాయకులు దండె శ్రీనివాస్, బీజేపీ నాయకులు కొట్టె చంద్రశేఖర్, రమేష్‌బాబు, చల్లా మధు, లక్ష్మిరెడ్డి, ఉపేంద్రనాథ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సలీంనగర్‌కు చెందిన ఇన్సాఫ్ నాయకుడు ఆటో కార్మికుడు కలాం అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబానికి రూ. వేల నగదును అందించినట్లు ఇన్సాఫ్ రాష్ట్ర సమితి సభ్యులు జిలానీ బాషా, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు సోమవారం తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి


బోడెమ్మనూరులో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారిణి

ఉయ్యాలవాడ: పశువుల పెంపకందారులు అప్రమత్తంగా వుంటూ వ్యాధులు సోకిన వెంటనే పశువులకు చికిత్సలు చేయించాలని పశు వైద్యాధికారులు రవీంద్రనాథరెడ్డి, నాగశైలజ సూచించారు. సోమవారం మండలంలోని నర్సిపల్లె, బోడెమ్మనూరు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలలో 900 మేకలు, గొర్రెలు, 86 దూడలు, 58 పశువులకు చికిత్సలు నిర్వహించారు. బొబ్బు రోగాలకు టీకాలు, గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణకు మందులు తాపించారు.

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండలో సోమవారం సర్పంచు దేగాని వెంకటేష్ ఆధ్వర్యంలో పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పశువుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యమందించారు.

శిరివెళ్ల: మండలంలో పశువైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. సోమవారం కాదరబాదరలో పశువైద్యాధికారి దస్తగిరి 1250 గొర్రెలు, మేకలు, 47 దూడలు, 300 జాతి గేదెలకు టీకాలు వేశారు. ఈ నెల 31 శిబిరాలు నిర్వహించి టీకాలు చేయడం జరుగుతుందన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు


మహానందీశ్వరస్వామివారికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, అర్చకులు బొక్కెం శరభయ్య శర్మలు ముందుగా మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అలంకార మండపంలో గణపతి, అలంకార పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పల్లకీ ఉత్సవాన్ని తిలకించారు.